క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

బిక్కవోలు: స్థానికంగా ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భాద్రపద మాసం మంగళవారం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికర సంఖ్య భక్తులు తరలి వచ్చి స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఆలయం ఇవో భాస్కర్, సిబ్బంది ప్రసాద్, సత్తి బాబు తదితరులు సేవలందించారు.

నదులే నాగరికతకు నిలయాలు


కొంకుదురులో విద్యార్థులకు నదులపై వివరిస్తూ ఉపాధ్యాయుడు లక్ష్మణరెడ్డి

బిక్కవోలు: నదులే నాగరికతకు నిలయాలని కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పాఠశాల వద్ద నదుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదులే నాగరికతకు నిలయాలని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని అన్నారు. మన దేశంలో గంగ, యమున, గోదావరి, కృష్ణా వంటి అనేక నదులను పవిత్రమైన దేవతలుగా పూజిస్తారని అంతే కాకుండా ప్రతి పన్నెండేళ్ల కొకసారి పుష్కారాలను ప్రజలంతా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సాంఘిశాస్త్ర ఉపాధ్యాయుడు మేడపాటి లక్ష్మణరెడ్డి ఇంటరాక్టివ్ ప్లాట్ పేనల్ ద్వారా మన దేశంలోని వివిధ నదులు వాటి జన్మ స్థలాలు, నదుల వల్ల మానవాళికి కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీ కృష్ణ సాయి,పడాల ఈశ్వరరెడ్డి, వలీషా, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ చౌదరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన

బిక్కవోలు: గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా బలభద్రపురం గ్రామంలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. దాతలు సహకారంతో కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో చెరువుగట్టు వద్ద భారీ ఎత్తున అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలోని ఆలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 పోస్టర్ ఆవిష్కరణ

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం గ్రామ సర్పంచి లంక మున్ని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సత్యానారాయరెడ్డి ఎన్డీఏ ప్రభుత్వ వంద రోజుల అభివృద్ధి, సంక్షేమపై వివరించారు. అనంతరం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జుత్తక సూర్యకుమారి, తమలంపూడి శివ రామకృష్ణారెడ్డి, రావడ నాగు, సచివాలయం కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ


రంగంపేట పీహెచ్‌సీలో ఏఎన్ఎంల రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్‌టీం సభ్యులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎం అండ్ హెచ్ఓ రాజమహేంద్రవరం కార్యాలయం నుంచి జిల్లా టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంల దగ్గర ఉన్న అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ రిపోర్టింగ్ సరిగా చేస్తున్నారా లేదా ఆరా తీశారు. ఏఎన్ఎంల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని ముకుందవరం గ్రామాన్ని వారు సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్‌టీం సభ్యులు డీపీహెచ్ఎన్ఓ వసంతలక్ష్మి, డీఎస్ఓ సీహెచ్ భాస్కర్, డీపీఓ సంధ్యారాణి, జిల్లా డేటా మేనేజర్ రామకృష్ణ, రంగంపేట పీహెచ్‌సీ సీహెచ్ఓ కె.జయమణి, ఎంపీహెచ్ఈఓ ప్రసాద్, ఎంపీహెచ్ఎస్ నాగలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

బాబూ.. జాబ్ తీయొద్దు

- అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ
- ఆగమ్యగోచరంగా మద్యం షాపుల ఉద్యోగుల పరిస్థితి
- దుకాణాల కోసం కూటమి తమ్ముళ్ల ప్రయత్నాలు


పందలపాకలో ఉన్న మద్యం దుకాణం


అమ్మకానికి సిద్ధంగా ఉన్న మద్యం సీసాలు

బిక్కవోలు: నూతన మద్యం పాలసీతో కొందరి ఉద్యోగాలకు ప్రభుత్వ ఎసరు పెట్టింది. అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేయనుంది. ఈ ప్రకటనతో మద్యం దుకాణాల ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడికి, బెల్టు షాపుల నియంత్రణకు ఉద్యోగులను నియమించింది. ప్రభుత్వం పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కాయి. సూపర్‌వైజర్, సేల్స్‌మేన్, నైట్ వాచ్‌మెన్ తదితరు ఉద్యోగాలను క్రియేట్ చేసి ఒక్కో షాపులో నలుగురు నుంచి ఐదుగురికి ఉపాధి కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండడంతో తమ భవిష్యత్ ఏమిటని వారంతా ఆందోళన చెందుతున్నారు.

జగన్ ఉద్యోగాలిస్తే బాబు తీసేస్తున్నారు..

2019కి ముందు ఉన్న మద్యం దుకాణాలకు ప్రతి రెండేళ్ల కోసారి టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించేవారు. కొన్ని ముఖ్యమైన మద్యం దుకాణాలకు డిమాండ్ ఉండేది. ప్రైవేటు దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు చెక్ పెట్టి పలువురు నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది.

దుకాణాల్లో పని చేస్తున్న ఉద్యోగులు

నియోజకవర్గంలో అనపర్తి మండలంలో 9 షాపులు 9 మంది సూపర్‌వైజర్లు, 21 మంది సెల్స్‌మెన్, 9 మంది నైట్ వాచ్‌మన్లు ఉన్నారు. బిక్కవోలు మండలంలోని 5 షాపుల్లో ఐదుగురు సూపర్‌వైజర్లు, 12 మంది సెల్స్‌మన్లు. ఐదుగురు నైట్ వాచ్‌మన్లు, రంగంపేట మండలంలో 3 షాపుల ద్వారా ముగ్గురు సూపర్‌వైజర్లు, ఏడుగురు సెల్స్‌మన్లు, ముగ్గురు నైట్ వాచ్‌మెన్లు ఉన్నారు. పెదపూడి మండలంలో ఏడు షాపుల ద్వారా ఏడుగురు సూపర్‌వైజర్లు, 16 మంది సెల్స్‌మెన్లు, ఏడుగురు నైట్ వాచ్‌మెన్లు పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వం నొటిఫికేషన్ ఇచ్చి ఇంటర్వ్యూలు సర్టిఫికెట్ వెరిఫికేషన్ల ద్వారా నియమాకాలు చేపట్టింది. సూపర్‌వైజర్‌కు నెలకు రూ.21,500, సేల్స్‌మెన్లకు రూ.19,500, నైట్ వాచ్ మెన్లకు రూ.9,500 వేతనం అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో ప్రభుత్వం మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నా ఉద్యోగులంతా రోడ్డున పడనున్నారు.

కూటమి తమ్ముళ్లకే షాపులు

అక్టోబర్ ఒకటి నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ దుకాణాలను తొలగించి గతంలోలా ప్రైవేట్ దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో కూటమి నేతలు ఇప్పటి నుంచే షాపులను దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ప్రైవేట్ షాపుల విషయంలో టెండర్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో లక్కీడీప్ ద్వారా షాపులు కేటాయించేవారు. ఇప్పుడు అలాగే జరుగుతుందా? లేదా అనేది తేలాల్సిఉంది. దీంతో షాపులలో పని చేసే ఉద్యోగులు ఉంటారా ఉద్యోగం ఉంటుందా లేదా అని సందేహంతో ప్రస్తుత ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ఎంపిక


జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెదపూడి: అనపర్తిలో జీబీఆర్ పాఠశాలలకు చెందిన 11 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికైయ్యారని జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి ఆదిరెడ్డి తెలిపారు. ఆ పాఠశాల్లో విద్యార్థులను యాజమాన్యం, పాఠశాల ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించారు. ఆదిరెడ్డి మాట్లాడుతూ అండర్-14 విభాగంలో కె.వీదీప్ శిరీష్‌రెడ్డి (బ్యాడ్మింటన్), అమృత ప్రిన్సెస్ (షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో) ఎ.హాసిని (షాట్‌పుట్) జి.హాసిత (ఖోఖో) క్రీడా విభాగాల్లో ఎంపికైయ్యారన్నారు. అలాగే అండర్-17 టీ.దీపక్‌ఎస్.ఎస్.రెడ్డి (చెస్), కె.గిరిజాదుర్గాప్రసాద్ (ఖోఖో), డి.అఖిల్ (బ్యాడ్మింటన్), ఎం.డీ.ఎస్.ప్రణీత కళ్యాణి (డిస్కస్‌త్రో, షాట్‌పుట్), పి.అమృత (రన్నింగ్), పీ.ఎస్.ఎస్. ఎల్.వాణి 'షాట్‌పుట్), వి.మైటీ (ఖోఖో) క్రీడా విభాగాల్లో ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు గొలుగూరి రామారెడ్డి, గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ జి.హరిప్రసాద్, ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ రామారావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.భువనేశ్వరి, ప్రీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జి.కామాక్షి, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి మహీంద్రా, ఏఓ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనతో అధిక దిగుబడి

వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి


కరకుదురులో రైతులకుఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేస్తున్న అధికారులు

పెదపూడి: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి అన్నారు. దోమాడ, కరకుదురు గ్రామాల్లో మంగళవారం ఎలుకవల నిర్మూలనకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నప్రశాంతి మాట్లాడుతూ రైతులందరూ ఎలుకల మందును బొరియల వద్ద ఒకేసారి పొట్లాటు కట్టి పెట్టాలన్నారు. దీంతో ఎలుకలు ఆ మందును తిని ఒకేసారి చనిపోతాయన్నారు.

కరకుదురు, దోమాడలో..

మండలంలో దోమాడ, కరకుదురు గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి, జిల్లా ఆత్మ పీడీ డైరెక్టర్ జ్యోతిర్మయి, మండల వ్యవసాయశాఖ అధికారి టీవీఆర్ మణిదీప్, విస్తరణ అధికారి ఎస్.సత్యనారాయణ హాజరై రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

పేకాడుతున్న తొమ్మది మంది అరెస్టు

సీతానగరం: రఘుదేవపురంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసినట్టు ఎస్సై రామ్‌కుమార్ మంగళవారం తెలిపారు. గ్రామంలో గోదావరి ఒడ్డున పేకాటడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.7,250 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్సై తెలిపారు.

సేవ అమూల్యమైంది


సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకులు మదీనాను సన్మానించిన సిబ్బంది


కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్నవిద్యార్థులు

సీతానగరం: సేవ అనేది అమూల్యమైందని, ఇతరుల నుంచి ఏమి ఆశించకుండా ప్రేమతో చేసే ప్రతి చిన్న పని సేవ అవుతుందని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్ ఫౌండేషన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ మహాత్మాగాంధీ, మదర్ థెరిసా వంటి ప్రేమమూర్తుల వ్యక్తిత్వాలను పరిశీలిస్తే సేవ అనే పదం అర్థమవుతుందన్నారు. కామర్స్ అధ్యాపకులు షేక్ దర్గా మదీనా, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎం.సుధామయి తదితరులు ప్రసంగించారు. అనంతరం కామర్స్ అధ్యాపకులు మదీనాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాదవ్, సుబ్బారావు, వాణి, మీనాక్షి, అలేఖ్య, వెంకటేష్, మనోహరి, రాజేశ్వరి, సురేష్ చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గైట్‌లో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

రాజానగరం: విద్యాభ్యాసనతోపాటు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా యువతకు దేశ భక్తి, సమాజంపై సేవాభావం పెరుగుతుందని గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ బాలు అన్నారు. ఇదే ఆశయంతో జాతీయ సేవ పథంను ప్రారంభించారన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వలంటీర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్, పీఓ ఎం.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం


మండల పరిషత కార్యాలయంలో ఎంపీపీ జ్యోత్స్న, వైస్ ఎంపీపీ మదన్‌బాబులను సన్మానిస్తున్న నాయకుడు

సీతానగరం: వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలుగా పదవిని చేపట్టి మూడేళ్ల పూర్తయిన సందర్భంగా సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, సన్మాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న ఆధ్వర్యంలో ఎంపీటీసీలు కేక్ కట్ చేశారు. ఎంపీపీ జ్యోత్స్న, వైస్ ఎంపీపీ సత్యం మదన్‌బాబు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజులను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ గడచిన మూడేళ్లల్లో ప్రజలకు ఎన్నో సేవలు అందించామన్నారు. మండల అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు పంతుల వెంకటరమణ, నల్లమోలు భాస్కర్, కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, ముదునూరి సుబ్బలక్ష్మి, జి.చిన్ని, సుంకవెల్లి సత్యానారాయణ, ఉస్సే ఏసమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే 'పొలం పిలుస్తోంది'


నరేంద్రపురంలో వరి క్షేత్రాన్ని సందర్శించిన వ్యవసాయాధికారులు


ఇనుగంటివారిపేటలో రైతులకు సూచనలిస్తున్న అధికారులు

రాజానగరం: మండలంలోని నందరాడ, నరేంద్రపురంలలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా గ్రామాలలో సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించి, రైతులకు తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు డి. శ్రీనివాస్, ఏఓ షేక్ ఇమామీ కాసిమ్, దివ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

సీతానగరం: మండలంలోని కూనవరం, ఇనుగంటివారిపేటల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏఓ కె.సూర్యరమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఎలా సాధించాల్లో రైతులకు వివరించారు. ప్రస్తుత వాతావరణ మార్పుల వల్ల వరిలో వచ్చిన ఆకు ఎండు తెగులు నివారణ చర్యలను యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రకృతి వ్యవసాయం, పురుగు మందుల పిచికారీలో డ్రోన్లు ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణాధికారిగా వచ్చిన ఐఏఎల్ ల్యాబ్ ఏవో డి.రామతులసి పంటపొలంలో భూసార పరీక్షలకు మట్టి శాంపిల్స్‌ను ఎలా తీయాలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనుగంటి వారిపేట, కూనవరం రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

మధురపూడి: సస్య రక్షణ చర్యల ద్వారానే వరి పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు అన్నారు. కోరుకొండ మండలం నర్సాపురంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు మోతాదుకు మించి వాడొద్దని, రైతన్నలకు పంట దిగుబడి పెరిగి, లాభాలు వచ్చేలా అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తొలుత పంటపొలాలను పరిశీలించారు. అనంతరం రైతన్నలతో సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి గౌరీదేవి మాట్లాడుతూ పొట్ట దశకు చేరుతున్న పంటకు తగినంతం మోతాదులో ఎరువులు వేయాలన్నారు. డ్రోన్ ద్వారా ఎరువులు పిచికారీ చేయడం లాభదాయకం అన్నారు.

ఎండాకు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి

రంగంపేట: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరిలో ఎండాకు తెగులు ఎక్కువగా ఉందని, దీని నివారణకు తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని అనపర్తి డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ డీవీ కృష్ణ సూచించారు. మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పంటలను పరిశీలించి అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వరి ఈనిక దశలో ఉందని, ఎండాకు తెగులు సోకిన పొలంలో నివారణ చర్యలు చేపట్టకపోతే పిలకలు ఎండిపోయి వెన్నులు సరిగా రాకపోవడం, లేదా తాలు గింజలు ఏర్పడతాయన్నారు. కావున వెంటనే ఎండాకు తెగులు నివారణకు కాపరాసిక్ క్లోరైడ్, ప్లాంటామైసిన్ కలిపి పిచికారీ చేయాలన్నారు. 20 కిలోల పొటాష్ వేయాలన్నారు. పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలని సూచించారు. వరిలో ఎలుకలు చేసే నష్టాన్ని వివరిస్తూ వాటి నివారణకు నూకల్లో కలిపిన బ్రోమోడయోలిన్ మందును రైతులకు సరఫరా చేశారు. ఉద్యాన శాఖ అధికారులు మాట్లాడుతూ పామాయిల్ మొక్కలు నూరు శాతం రాయితీపై అందిస్తామన్నారు. డ్రిప్, స్ప్రింకర్లు సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం టోటల్ మిక్స్‌డ్ రేషన్, పశు కిసాన్ క్రెడిట్ కార్డు స్కీమ్స్ గురించి రైతులకు వివరించారు. బ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, రైతులు పాల్గొన్నారు.


రంగంపేటలో రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు


నర్సాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి

సినీ డైరెక్టర్, నటుడు కాశీవిశ్వనాథ్


రఘుదేవపురం అన్నసమారాధనలో పాల్గొన్న సినీ నటుడు కాశీవిశ్వనాథ్

సీతానగరం: వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని సినీ డైరెక్టర్, నటుడు వై.కాశీవిశ్వనాథ్ కోరారు. మంగళవారం రఘుదేవపురం వినాయకుని ఆలయం చెరువు గట్టు సమీపంలో గణపతి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు, పట్టణాల్లో గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. నేటి యువత చెడు మార్గాల్లో కాకుండా మంచి మార్గంలో పయనించడం ఎంతో హర్షనీయమని ఆయన అన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. సమారు నాలుగువేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ వారు యలమాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారుల బదిలీలు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల అనంతరం పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న బదిలీల్లో నియోజకవర్గం రెవెన్యూ శాఖలో కలెక్టరు పి.ప్రశాంతి పలువురిని బదిలీ చేశారు. రాజానగరం మండల డిప్యూటీ తహసీల్దారుగా కె.సుధాకరరావు వై.రామవరం మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. రాజమహేంద్రవరం యూనిట్-1లో ఎలక్షన్ డీటీగా ఉన్న ఎ.కుమారిని స్పెషల్ డీటీగా రాజానగరం మండలానికి బదిలీ చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ మండలం నుంచి డి.సాయిరామ్‌ను కోరుకొండ మండలానికి డీటీగా, గోకవరం మండలంలో రీసర్వే డీటీగా ఉన్న ఎ.రజనీని కోరుకొండ మండలానికి డీటీగా బదిలీ చేశారు. వీరిద్దరిలో ఒకరు ఎలక్షన్ డీటీగా విధులు నిర్వర్తిస్తారు. సీతానగరం మండలంలో రీసర్వే విభాగంలో డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న పి.సర్వేశ్వరమూర్తిని అదే మండలానికి డీటీగా నియమించారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బిక్కవోలు: పందలపాక గ్రామానికి చెందిన శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా ప్రరిషత్ ఉన్నత పాఠశాల పందలపాకకు చెందిన విద్యార్థులు 21 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులు అనపర్తి బాలుర ఉన్నత పాఠశాల వద్ద నియోజకవర్గం స్థాయి జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు 21 మంది ప్రతిభ కనబరిచి ఎంపికయినట్లు తెలిపారు. వారిలో 11 మంది బాలికలు, 10 మంది బాలురు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు చక్కటి శిక్షణ ఇచ్చిన పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డి కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రరి జయ కృషారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం డివిజన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఆర్డీఓ కేఎస్ శివజ్యోతి నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ శివజ్యోతి మాట్లాడుతూ రాజమండ్రి అర్బన్, కోరుకొండ, రంగంపేట, రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించామన్నారు. మూడు అంగన్‌వాడీ వర్కర్ల పోస్టుల కోసం 15 మంది, 33 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు 93 మంది, ఒక మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు ఇద్దరు ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.విజయకుమారి మాట్లాడుతూ గురువారం కొవ్వూరు డివిజన్ పరిధిలో పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఇంటర్వ్యూ కమిటీ సభ్యులు డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్, సంబంధిత సీడీపీఓలు హాజరయ్యారు.

కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్ సెల్, జువాలజీ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రా యూనివర్సిటీ ఎపీఎస్‌డీసీ అడ్మినిస్ట్రేటర్ అండ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణిప్రకాష్ మాట్లాడుతూ ఆక్వా కల్చర్‌కి సంబంధించిన ఉద్యోగాలు, అవసరమైన స్కిల్స్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ వీర్రాజు, సూరిబాబు, మౌనిక, మహమ్మద్, భువనేశ్వరి, శివరంజని, ప్రియాంక పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ గిరి బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బీవీ గిరి సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాలకొల్లు ఏపీఎంఐఎస్‌డీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న డి.బాలశంకర రావు ఒంగోలుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. మంగళవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈఈ గిరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానన్నారు.